# తత్వం

అప్పుడే రైలుదిగిన నాగభూషణరావు చేతిలో సూట్ కేస్ పట్టుకుని స్టేషను బయటికి వచ్చాడు. "రిక్షా కావాలా సార్?" అంటూ తనచుట్టూ మూగిన రిక్షావాళ్ళని ఒకసారి కళ్ళు చిట్లించి విసుగ్గా చూశాడు.

"ఏరా...వస్తావా?"

"చెప్పండి సార్...ఎక్కడికి?" అన్నాడు వాడు సీటు దులుపుతూ.

"గాంధీ చౌక్."

"రండి...కూర్చోండి."

"ఏం పుచ్చుకుంటావ్?"

"రూపాయి ఇప్పించండి సార్."

"ముప్పావలా ఇస్తాను...వస్తావా?..."

"అబ్బే...కుదరదండి...ఎత్తు-పైగా ఎదురుగాలి."

"అయితే పో....."

ఇంకో రిక్షావాడిని అడిగాడు నాగభూషణరావు.

"ఏటి....గాంధీ చౌకేనా?....రూపాయి యిప్పించండి దొరా!"

ముప్పావలాకి ఒక్కపైసా కూడా ఎక్కువ యివ్వనని చెప్పి ముందుకు అడుగులు వేశాడు.

"ఇదిగో రిక్షా..!..నిన్నే....గాంధీ చౌక్ వస్తావా?"

"ఆ....రూపాయిపావలా యిప్పించండి"

"ఏవిటీ? !.... రూపాయిపావలానా? ?.... నేనీ ఊరికి క్రొత్తనుకున్నావా ఏమిటీ ?.... ముప్పావలా యిస్తాను.... వస్తే రా- లేకపోతే పో...."

"ఎప్పుడైనా రిక్షా ఎక్కిన మొగమేనా ఇది" అని పొగరుగా అంటూ వెళ్ళిపోయాడు వాడు.

నాగభూషణరావుకి వాడిమీద గొంతుదాకా కోపం వచ్చింది. కాని ఏం చెయ్యగలడు?....

ఇంకొంతమందిని అడిగాడు. ఎవ్వరూ రూపాయికి తగ్గలేదు. నిజానికి స్టేషనునుండి గాంధీచౌక్‌కి ముప్పావలా సరైన ధరే! కాని రైల్లోంచి దిగినవాళ్ళు తాము ఎంత చెప్పినా వస్తారని రిక్షావాళ్ళు వాళ్ళిష్టమొచ్చిన విధంగా అడుగుతుంటారు.

నాగభూషణరావుకి విసుగుపుట్టింది. ప్రయాణంచేసి చాల బడలికగా ఉంది. దానికితోడు రాత్రంతా రైల్లో నిద్ర లేదు. "పోనీలే.... ఒక్కపావలాతో నేను మిగిల్చేదేమిటి?.... రూపాయి యిచ్చి వెళ్ళిపోతాను" అనుకున్నాడు.

"ఏయ్ రిక్షా...గాంధీచౌక్ కి వస్తావా?" అంటూ ఒక రిక్షావాడిని అడిగాడు.

"రండి బాబూ.. .కూర్చోండి"

"ఏం తీసుకుంటావ్?"

వాడెలాగూ రూపాయి అడుగుతాడని అనుకుంటూ ప్రశ్నించాడు నాగభూషణరావు.

"ముప్పావలా యిప్పించండి బాబయ్యా!...అన్నాడు రిక్షావాడు అతివినయంగా.

"అరవై పైసలు ఇస్తాను....వస్తావా? ..." అన్నాడు నాగభూషణరావు.

జనవరి 1975, యువ